గురువారం 20-6-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 370, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM


SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

## దక్షిణ భారతంలో మండుతున్న ఎండలు

- గత 24 గంటల్లో 50కి మందికి పైగా మృతి
- చాలా ప్రాంతాల్లో సుమారు 50 డిగ్రీలు నమోదు



ముందడుగు జాతీయం

దక్షిణ భారత దేశంలో భానుడు కాస్త ఉపశమనం కలిగించినప్పటికీ.. గత కొన్ని రోజులుగా ఉత్తర భారతాన్ని మాత్రం ఎండలు వణికిస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో సుమారు 50 డిగ్రీల ఎండలు నమోదు అవుతున్నాయి. ఇక ప్రధానంగా ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో హీట్ వేవ్ దారుణంగా ఉంది. ఈ క్రమంలోనే గత 24 గంటల్లోనే ఢిల్లీలో ఏకంగా 50కి పైగా మరణాలు సంభవించడం దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనంగా మారింది. ఎండదెబ్బ సంబంధిత సమస్యలతో ఆస్పత్రిలో చేరిన వారి సంఖ్య పెరుగుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఢిల్లీలోని 10 జిల్లాలు ఉండగా.. కేవలం 3 జిల్లాల్లోనే ఈ 40 కి పైగా మరణాలు చోటు చేసుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

గడిచిన 24 గంటల్లో 50కి పైగా మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వాసుపత్రులకు తరలించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ 50 మృతదేహాల్లో 40 మృతదేహాలను డీడీయూ ఆస్పత్రిలోనే చేర్చినట్లు తెలుస్తోంది. అయితే ఈ మరణాలకు సరైన కారణం.. శవపరీక్ష రిపోర్ట్ ఆధారంగా తెలుస్తుందని అధికారులు పేర్కొన్నా.. అవి ఎండవేడిమికే అని ప్రాథమికంగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మృతుల సంఖ్య అసాధారణంగా పెరగడం తీవ్ర ఆందోళన కలిగించే అంశమని డాక్టర్లు చెబుతున్నారు.



## అరవింద్ కేజ్రీవాల్ కస్టడీ పొడిగింపు

### జూలై 3 వరకు జ్యుడీషియల్ కస్టడీ

ముందడుగు ఢిల్లీ:

ఢిల్లీ లిక్కర్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు జూలై 3 వరకు పొడిగించింది. కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని పొడిగించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కోర్టును కోరింది. తదుపరి విచారణకు సీఎం కస్టడీ ముఖ్యమంతి ఈడీ వాదనలు వినిపించింది. అయితే, వాదనలను కేజ్రీవాల్ తరపు న్యాయవాది వివేక్ జైన్ కొట్టిపడేశారు. ఈడీ కస్టడీ పొడిగింపు పిటిషన్ 'యోగ్యత లేనిది' అని పేర్కొన్నారు. మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌ను ఈడీ మార్చి 21న అరెస్టు చేసింది. ఆ తర్వాత ఆయన జ్యుడీషియల్ కస్టడీలో తిహార్ జైలులో ఉంటున్నారు.

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆయనకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. ఆ తర్వాత మరికొద్ది రోజులు మధ్యంతర బెయిల్‌ను పొడిగించాలని కోరగా.. సుప్రీంకోర్టు నిరాకరించింది. దాంతో ఆయన మళ్లీ జూన్ 2న జైలులో లొంగిపోయిన విషయం తెలిసిందే. మరో వైపు ఇదే కేసులో నిందితుడు వినోద్ చౌహాన్ కస్టడీని జూలై 3 వరకు పొడిగించారు. చౌహాన్‌ను మేలో అరెస్టు చేశారు.



**మళ్లీ తొలిస్థానానికి చేరుకున్న ఎలాన్ మస్క్**

వివరాలు 2లో



**వరదల కారణంగా అస్సాం అతలాకుతలం**

వివరాలు 2లో



**అమెజాన్ ఆర్డర్‌లో విషపూరిత పాము ప్రత్యక్షం**

వివరాలు 3లో



**జరా.. ఈ అమ్మాయి చాలా హాట్...**

వివరాలు 5లో

## అంతర్జాతీయ యోగా దినోత్సవానికి మోడీ

- ఏడు వేల మంది పాల్గొనేలా ఏర్పాట్లు
- జూన్ 21న జమ్మూకశ్మీర్‌లో నిర్వహణ

ముందడుగు జాతీయం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జమ్మూకశ్మీర్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో పాల్గొననున్నారు. దాల్ సరస్సు ఒడ్డున మోడీ యోగా మిగతా 2లో



ముందడుగు
గురువారం, 20-6-2024, హైదరాబాద్

# అంతర్జాతీయ యోగా దినోత్సవానికి మోడీ

మొదటిపేజీ తరువాయి

చేయనుండగా.. జూన్ 21న జరిగే కార్యక్రమంలో దాదాపు ఏడు వేల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిని పర్యవేక్షించిన జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా.. యోగా డే సందర్భంగా మోదీ కశ్మీర్ లోయకు రావడంపై హర్షం వ్యక్తం చేశారు.

''కశ్మీర్ ప్రజలతో మోదీకి మంచి అనుబంధం ఉంది. అందుకే ఆయన ఇక్కడికి రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. మోదీ రాక మాకెంతో గర్వకారణం. ఆ రోజు జరగబోయే కార్యక్రమంలో ఆయనతో పాటు 7 వేల మందికి పైగా పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నాం'' అని మనోజ్ సిన్హా పేర్కొన్నారు. ''గత పదేళ్లలో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై యోగా ఎంతో గుర్తింపు పొందింది. ఇప్పటివరకు జరిగిన కార్యక్రమాల్లో 23.5 కోట్ల మందికి పైగా పాల్గొన్నారు. ఏటా యోగా చేసే వారి సంఖ్య పెరగడం హర్షణీయం. ఒత్తిడి లేని ప్రశాంతమైన జీవితం కోసం ప్రజలు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు'' అని జమ్మూకశ్మీర్ ఎల్జీ వెల్లడించారు. కాగా.. జమ్మూకశ్మీర్‌లో ఇటీవల వరుస ఉగ్ర ఘటనలు చోటు చేసుకోవడం ఆందోళనకు గురిస్తోంది. దీంతో ఈ నెల 29న ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్ర కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని సిన్హా పేర్కొన్నారు.

# మళ్లీ తొలిస్థానానికి చేరుకున్న ఎలాన్ మస్క్

## ప్రపంచ కుబేరుల జాబితాలో మొదటిస్థానం

ముందడుగు జాతీయం

టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ మళ్లీ ప్రపంచ కుబేరుల జాబితాలో తొలి స్థానానికి చేరుకున్నారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ ఇండెక్స్ తాజా నివేదిక ప్రకారం.. 208 బిలియన్ డాలర్ల నికర విలువతో బెజోస్‌ను వెనక్కి నెట్టి మొదటి స్థానానికి చేరుకున్నారు. 205 బిలియన్ డాలర్లతో జెఫ్ బెజోస్, 199 బిలియన్ డాలర్లతో బెర్నార్డ్ ఆర్నాల్డ్ తర్వాతి స్థానంలో నిలిచారు. చాలా కాలం నుంచి ఈ ముగ్గురి మధ్య గట్టి పోటీ నడుస్తోంది. తాజాగా టెస్లా షేర్లు రాణించడంతో మస్క్



తిరిగి మొదటి స్థానంలో నిలిచారు. ఇటీవల జరిగిన టెస్లా సాధారణ వార్షిక సమావేశంలో మస్క్ వేతన ప్యాకేజీకి ఆమోదముద్ర పడింది. 56 బిలియన్ డాలర్ల వేతన ప్యాకేజీని ఇచ్చేందుకు ఇన్వెస్టర్లు అంగీకరించారు. దీంతో టెస్లా షేర్లు రాణించాయి. పే ప్యాకేజీపై పోరాటం, ఫ్రాన్స్‌లో ముందస్తు ఎన్నికలు, టెక్-స్టాక్ ర్యాలీ కారణంగా మస్క్ సంపద బాగా పెరిగింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వెంచర్ xAIకి 24 బిలియన్ల డాలర్లు కంటే ఎక్కువ నిధులు వచ్చి చేరడం కూడా ఆయనకు కలిసొచ్చింది. బ్లూమ్‌బర్గ్ వెల్త్ ఇండెక్స్ ప్రకారం మస్క్‌కు కంపెనీలో 65శాతం వాటా ఉంది.

# విమానంలో ఉక్కపోత.. పనిచెయ్యని ఏసీ

## తీవ్ర అవస్థలు పడ్డ ప్రయాణికులు




ముందడుగు జాతీయం:

ప్రయాణికులు సాధారణంగా బస్సులు, రైళ్లు, ఆటోలో ప్రయాణం చేసేటప్పుడు ఉక్కపోతకు గురవుతుంటారు. ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు పేపర్లు, అట్టముక్కలు, క్లాత్స్ వంటి వాటితో ఊపుకుంటుంటారు. అయితే, తాజాగా ఓ విమానంలో ఉక్కపోతకు ప్రయాణికులు అల్లాడిపోయారు. ఏసీ లేక తీవ్ర అవస్థలు పడ్డారు.

ఢిల్లీ నుంచి దర్భంగా వరకూ ప్రయాణించిన ఓ స్పైస్ జెట్ విమానం (SG 476)లో ఈ ఘటన చోటు చేసుకుంది. విమానంలో సుమారు గంటకు పైగా ఏసీ పని చేయలేదు. దీంతో ప్రయాణికులు ఉక్కపోతతో అల్లాడారు. కొందరు అస్వస్థతకు గురయ్యారు. గాలి కోసం తమ చేతిలో ఉన్న వస్తువులతో విసురుకుంటూ కనిపించారు. ప్రయాణికుల అవస్థలు చూసిన తోటివారు విమానంలోని పరిస్థితిని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయగా అదికాస్తా ప్రస్తుతం వైరల్‌గా మారింది. వీడియోపై స్పందించిన విమానయాన సంస్థ ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు చెప్పింది. సాంకేతిక సమస్యతో ఈ పరిస్థితి నెలకొందని, ఇలాంటి ఘటన మరోసారి పునరావృతం కాకుండా చూసుకుంటామని వివరణ ఇచ్చింది.

# మాతృభాషలో తప్పులు రాసిన కేంద్రమంత్రి

## తప్పుగా రాయడంపై తీవ్ర విమర్శలు



ముందడుగు జాతీయం:

'బేటీ బచావో, బేటీ పడావో'ను పాపులర్ నినాదాన్ని ఒక మహిళా కేంద్రమంత్రి సరిగా రాయలేకపోయారు. కేంద్రమంత్రి మాతృభాషలో ఈ పదాన్ని తప్పుగా రాయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనికి సంబంధించిన దృశ్యాలు నెట్టింట్లో చక్కర్లు కొడుతున్నాయి. సావిత్రి ఠాకుర్.. మధ్యప్రదేశ్‌లోని ధార్ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. కేంద్రమహిశా శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో మంగళవారం నిర్వహించిన 'స్కూల్ ఛలో అభియాన్' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ సందర్భంగా 'బేటీ బచావో, బేటీ పడావో' నినాదాన్ని ఒక బోర్డుపై రాశారు. అయితే దానిని సరిగా రాయలేకపోయారు. దానికి సంబంధించిన వీడియోలు వెలుగులోకి రావడంతో ఆమెపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ''రాజ్యాంగ పదవుల్లో ఉండి, అతిపెద్ద మంత్రిత్వ శాఖ బాధ్యతలు చూసుకుంటూ.. కనీసం మాతృభాషలో కూడా రాయలేకపోవడం శోచనీయం. అలాంటి వ్యక్తి తన మంత్రిత్వ శాఖను ఎలా నిర్వహిస్తారో..?'' అని కాంగ్రెస్ నేత కేకే మిశ్రా ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు కనీస విద్యార్హతలు ఉండేలా రాజ్యాంగంలో మార్పులు చేయాలని సూచించారు. అయితే ఈ విమర్శలను భాజపా ఖండించింది. అది హడావుడిలో జరిగిన పొరపాటని, ఆదివాసీ మహిళా ప్రతినిధి అని కూడా చూడకుండా కాంగ్రెస్ అనవసరపు రాద్ధాంతం చేస్తోందని మండిపడింది.



# వరదల కారణంగా అస్సాం అతలాకుతలం

- 15 జిల్లాల్లో పరిస్థితి దయనీయం
- రాష్ట్ర వ్యాప్తంగా 30 మంది మృతి

ముందడుగు అస్సాం:

అస్సాం రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షా లు కురుస్తున్నాయి. భారీ వర్షా లకు పోటెత్తిన వరద కారణంగా రాష్ట్రం అతలాకుతలమవుతోంది. సుమారు 15 జిల్లాల్లో పరిస్థితి దయనీయంగా మారింది. ఎక్కడికక్కడ రోడ్లు దెబ్బతిన్నాయి. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కుంభవృష్టిగా కురుస్తున్న వర్షా నికి నదులు పొంగి పొర్లుతున్నాయి. పలు నదులు ఉగ్రరూపం దాల్చి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. తీవ్రమైన వరదల కారణంగా ఇప్పటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 30 మంది ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక అధికారులు తెలిపారు. 15 జిల్లాల్లో 1.61 లక్షల మంది ప్రజలు ప్రభావితమైనట్లు చెప్పారు.

అస్సాం స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రకారం.. కరీంగంజ్ జిల్లాలో పరిస్థితి దయనీయంగా మారింది. అక్కడ సుమారు 1,52,133 మంది వరదనీటిలో చిక్కుకుపోయారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఫైర్, ఎమర్జెన్సీ సర్వీసెస్ వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడుతున్నారు. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ముందడుగు
గురువారం, 20-6-2024, హైదరాబాద్

# 'ఓహ్.. మీరేనా నన్ను ఓడించింది..

## లక్ష్మణ్ బాగ్‌కు నవీన్ పట్నాయక్ అభినందనలు



ముందడుగు ఒడిశా:

ఒడిశాలో ఇటీవలే జరిగిన ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఓడించిన బీజేపీ ఎమ్మెల్యేని ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అభినందించి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. నవీన్ పట్నాయక్ ఇటీవలే జరిగిన ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీ చేసిన విషయం తెలిసిందే. గంజాం జిల్లాలోని హింజలి, బొలంగీర్ జిల్లాలోని కంటాబంజి స్థానాల్లో బరిలోకి దిగారు. అయితే కంటాబంజిలో బీజేపీ అభ్యర్థి లక్ష్మణ్ బాగ్ చేతిలో ఓటమిపాలయ్యారు. అయితే హింజలిలో గెలిచిన ఆయన మంగళవారం ప్రమాణస్వీకరాం చేసేందుకు రాష్ట్ర అసెంబ్లీకి వచ్చారు. అక్కడ కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలందరినీ పలకరించి అభినందనలు తెలిపారు. ఆ సమయంలో నవీన్ పట్నాయక్‌ను చూసిన లక్ష్మణ్ బాగ్ లేచి నమస్కరించి పరిచయం చేసుకున్నారు. వెంటనే నవీన్ పట్నాయక్ 'ఓహ్.. మీరేనా నన్ను ఓడించింది. మీకు అభినందనలు' అని అన్నారు. దీంతో ఓడించిన అభ్యర్థిని ఆప్యాయంగా పలకరించి అభినందనలు తెలిపిన నవీన్ పట్నాయక్‌ను చూసి అక్కడున్న నూతన సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలంతా ఆశ్చర్యపోయారు.

# అమెజాన్ ఆర్డర్‌లో విషపూరిత పాము ప్రత్యక్ష్యం

## మరోసారి బయటపడిన అమెజాన్ నిర్లక్ష్యం




ముందడుగు జాతీయం:

ప్రస్తుత సమాజంలో ఆన్‌లైన్ షాపింగ్ చేసే వారి సంఖ్య భారీగా పెరుగుతుంది. ఒక్కోసారి ఒకటి ఆర్డర్ పెడితే దానికి బదులుగా మరో వస్తువు డెలివరీ అవుతుంటుంది. ఫోన్లు ఆర్డర్ చేస్తే బిస్కెట్లు, స్టోన్స్ వంటివి పార్శిల్‌స్‌లో వచ్చిన ఘటనలను ఇప్పటికే అనేకం చూశాం. తాజాగా ఇలాంటి ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. బెంగళూరులోని ఓ జంట ఆన్‌లైన్ షాపింగ్‌లో ఎక్స్‌బాక్స్ కంట్రోలర్ కోసం ఆర్డర్ పెడితే ప్రమాదకరమైన పామును అమెజాన్ ఆర్డర్ చేసింది. దీంతో అమెజాన్ నిర్లక్ష్యం మరోసారి బయటపడింది. కస్టమర్ చేసిన ఆర్డర్‌కు బదులు పామును పంపారు. అయితే విషపూరితమైన పాము అదృష్టవశాత్తూ ప్యాకేజింగ్ టేప్‌కు అంటుకోవడంతో ఆమె కుటుంబానికి ఎలాంటి హాని జరగలేదు. ఆర్డర్ ఓపెన్ చేసే ప్రక్రియను వారు వీడియో తీయడంతో దీనికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం వైరల్‌గా అవుతున్నాయి. ఈ ఘటనపై అమెజాన్ ప్రతినిధి స్పందించారు. దీనిపై అమెజాన్ ప్రతినిధి మాట్లాడుతూ..మా కస్టమర్‌లు, ఉద్యోగులు మరియు సహచరుల భద్రత మాకు అత్యంత ప్రాధాన్యతని, కస్టమర్‌లకు విశ్వసనీయమైన షాపింగ్ అనుభవాన్ని అందించడానికి మేము కష్టపడి పని చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరిపిస్తామని కస్టమర్‌లకు ఇలాంటి ఘటనలు జరగ్గకుండా జాగ్రత్త వహిస్తామని..వారికి పూర్తి భరోసా కల్పిస్తామని అమెజాన్ ప్రతినిధి హామీ ఇచ్చారు.

# 'అమ్మకు చెప్తా.. అనడంతో కొట్టి చంపాడు

- కన్నతండ్రే కాలయముడు అయ్యాడు
- 12 ఏళ్ల కూతురు ప్రాణాలు తీసాడు
- మియాపూర్ కేసులో భయానక వాస్తవాలు




ముందడుగు హైదరాబాద్:


కన్నబిడ్డను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన కన్నతండ్రే తన కూతురు పట్ల కాలయముడు అయ్యాడు. అభం శుభం తెలియని బాలిక ప్రాణాలు తీసాడు. సభ్యసమాజం తల దించుకునే ఘటన ఇది. మియాపూర్‌లో సంచలనం సృష్టించిన 12 ఏళ్ల బాలిక 'వసంత' అనుమానాస్పద మృతి కేసులో భయానక వాస్తవం వెలుగులోకి వచ్చింది. పాపను హత్య చేసింది కన్నతండ్రేనని తేలింది. అమ్మాయిని హత్య చేసి, 12 రోజులుగా కపట నాటకాలు ఆడుతూ పోలీసులనే తప్పదోవ పట్టించే ప్రయత్నం చేశాడు. కామంతో కళ్లు మూసుకుపోయి, కన్నకుమార్తెతోనే కోరిక తీర్చుకునేందుకు ప్రయత్నించి.. 'అమ్మకు చెప్తా..' అని పాప అరవడంతో దారుణంగా కొట్టి చంపేశాడు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మియాపూర్ ఏసీపీ పి. నర్సింహారావు బుధవారం (జూన్ 19) మీడియాకు వెల్లడించారు. మహబూబ్‌బాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామం లక్ష్మణ తండాకు చెందిన బానోతు నరేష్ దంపతులు బతుకుదెరువు కోసం మియాపూర్ సమీపంలోని నడిగడ్డ తండాకు వలస వచ్చారు. ఇక్కడికి వలస వచ్చిన 15 రోజులకే కన్న కూతురిని నరేష్ హత్య చేశాడు. నరేష్ మద్యానికి బానిసవడంతో పాటు సెల్‌ఫోన్లో పోర్న్ చూసేందుకు అలవాటు పడ్డాడు. మియాపూర్ సమీపంలోని అడవిలోకి తన కూతురిని తీసుకెళ్లిన నరేష్ కోరిక తీర్చాలని బలవంతపెట్టాడు. భయపడి పోయిన బాలిక అమ్మకు చెప్తానని అరవడంతో హతమార్చాడు. ఆ తర్వాత తానేమీ ఎరుగనట్టు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన కూతురు కనిపించడం లేదని మిస్సింగ్ కేసు పెట్టినట్టు చెప్పారు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు తండ్రే ఈ హత్య చేశాడని గుర్తించారు.

# నకిలీ కాల్స్ చేస్తే కఠిన చర్యలు

## ఐదేళ్ల పాటు విమాన ప్రయాణం నిషేధం

ముందడుగు జాతీయం:

విమానాశ్రయాలు, విమానయాన సంస్థలకు ఇటీవల నకిలీ బాంబు కాల్స్ తరచూ వస్తున్నాయి. దాంతో యాజమాన్యాలు, ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్న సందర్భాలు పెరుగుతున్నాయి. వీటిని అరికట్టడానికి ది బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ కఠిన చర్యలు తీసుకునే దిశగా ఆలోచనలు చేస్తోంది. నకిలీ కాల్స్ కేసుల్లో దోషులుగా తేలితే.. ఐదేళ్ల పాటు విమానాల్లో ప్రయాణించకుండా నిషేధం విధించాలని యోచిస్తున్నట్లు బీసీఏఎస్ వెల్లడించింది. ఈ ప్రతిపాదనను పౌర విమానయాన మంత్రిత్వశాఖ ముందు ఉంచనున్నట్లు తెలిపింది. ఈ విషయంలో ప్రస్తుతం మూడు నుంచి ఆరు నెలల నిషేధం మాత్రమే ఉంది. నిందితులు ఏ ఎయిర్‌లైన్‌కు అయితే బెదిరింపులు చేశారో.. దానివరకు మాత్రమే ఆ నిబంధన వర్తిస్తోంది. అయితే అన్ని సంస్థల విమానాలకు దీనిని వర్తింపజేయాలని బీసీఏఎస్ చూస్తోంది. నిన్న దేశవ్యాప్తంగా 41



విమానాశ్రయాలకు ఒకే రోజు బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపింది. ఈ బెదిరింపుల కారణంగా కొన్ని గంటలపాటు విమానాశ్రయాల్లో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి.

ముందడుగు
గురువారం,
20-6-2024,
హైదరాబాద్

## వర్షాలు కురవాలని
# కప్పలకు పెళ్లి

- రైతులకు ఆందోళన కలిగిస్తున్న వర్షా లు
- పత్తి రైతుల అగచాట్లు.. మొక్కజొన్న సాగుకు నిరీక్షణ



ముందడుగు తెలంగాణ:

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాలలో వర్షా భావ పరిస్థితులు రైతులకు ఆందోళన కలిగిస్తున్నాయి. దీంతో వర్షా లు కురవాలని, రైతులు కప్పతల్లి పూజలు చేస్తున్నారు. కప్పలకు పెళ్లిళ్లు చేసి వర్షా ల కోసం వరుణ దేవుడిని ప్రార్థిస్తున్నారు. వర్షా లు బాగా కురవాలని జగదేవపూర్ మండలం బీజీ వెంకటాపూర్ గ్రామంలో కప్పల పెళ్లి నిర్వహించారు. రెండు కప్పలకు పసుపు నీళ్లతో స్నానం చేయించి, మంత్రోచ్ఛారణల మధ్య ఆ రెండు కప్పలకు అందరూ చూస్తుండగా వివాహం జరిపించారు. ఈ ఆచారంలో భాగంగా మహిళా రైతులు కప్పలకు నీళ్లు పోస్తుంటే పిల్లలు కర్రకు కట్టిన కొత్తగా పెళ్లయిన కప్పల జంటను తీసుకొని గ్రామమంతా తిరిగారు.
ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలో వర్షా లు బాగా కురవడం లేదు. దాదాపు 60000 ఎకరాల్లో పత్తి వేసిన రైతులు పత్తి విత్తనాలు మొలకెత్తకపోవడంతో ఆందోళనలో ఉన్నారు. జూన్ మొదటి వారంలోనే మంచి వర్షా లు కురుస్తాయని వాతావరణ శాఖ చెప్పడంతో రైతులు ముందే పత్తి విత్తుకున్నారు. గత కొద్దిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కొన్ని ప్రాంతాలలో మాత్రమే వర్షా లు కురుస్తుండడంతో వర్షా లు పడని ప్రాంతంలో ఉన్న రైతులు వర్షా ల కోసం ఆకాశం వంక దిగాలుగా చూస్తున్నారు. ఇప్పటికే మొలకెత్తిన పత్తి పంటలను కాపాడుకోవడానికి రైతులు వాటర్ గన్ లు, స్ప్రింక్లర్లతో నీటిని అందిస్తూ నానా అగచాట్లు పడుతున్నారు.. చాలా మంది వరి, మొక్కజొన్న ఇంకా పంట వెయ్యలేదు. నాలుగు వర్షా లు గట్టిగా పడితే వారి, మొక్కజొన్న సాగు చెయ్యాలని చూస్తున్నారు. కానీ వర్షా లే లేవు.

# జరా.. ఈ అమ్మాయి చాలా హాట్...

- చూపు తిప్పుకోనివ్వని అందం ఆమె సొంతం
- అందాల పోటీల్లో ఇండియన్ AI మహిళ పోటీ





ముందడుగు ప్రత్యేకం:

అందాల పోటీలు ప్రాణం ఉన్న మనుషులకు అందులో మహిళలకు నిర్వహిస్తారు. కానీ ఇప్పుడు ప్రాణం లేని వర్చువల్ హ్యూమన్స్‌కి, అంటే కంప్యూటర్/ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా జనరేట్ చేసిన బొమ్మలకు సైతం ఈ పోటీలు పెడుతున్నారు. 'మిస్ AI' పేరుతో నిర్వహిస్తున్న AI జనరేటెడ్ మహిళ అందాల పోటీల్లో 'జరా శతావరి' అనే ఇండియన్ AI ఉమెన్ కూడా పోటీపడుతోంది. తాజాగా ఈ కాంపిటీషన్‌లో పది ఫైనలిస్ట్‌లుగా ప్రకటించగా అందులో జరా కూడా నిలిచింది. చూపు తిప్పకోనివ్వని అందంతో ఈ ఏఐ ఉమెన్ చాలా హాట్‌గా కనిపిస్తోంది. ప్రపంచంలోనే మొదటిసారి నిర్వహించిన ఈ పోటీలో 1,500 మందికి పైగా వర్చువల్ హ్యూమన్స్ పోటీ పడ్డాయి. వీటిలో కేవలం పది AI ఉమెన్స్ ఫైనల్ స్టేజ్‌కు చేరుకున్నాయి. ఈ పది AI-జనరేటెడ్ కంటెస్టెంట్స్ టాప్ 3 పొజిషన్స్ కోసం పోటీపడతాయి. ఈ నెల చివరిలో విజేతలను ప్రకటించనున్నారు. వీటి అందం, టెక్నాలజీ, సోషల్ మీడియా ప్రభావం ఆధారంగా ర్యాంకులను కేటాయిస్తారు. జరా శతావరి తనను తాను "PCOS అండ్ డిప్రెషన్ వారియర్" అని పిలుచుకుంటోంది. ఈ ఇండియన్ AI ఉమెన్, హెల్తీ లైఫ్‌స్టైల్‌కు ప్రాధాన్యత ఇస్తుంది. హిందూస్తాన్ టైమ్స్ రిపోర్ట్ ప్రకారం, జరా శతావరి హెల్త్, కెరీర్ డెవలప్‌మెంట్, ప్రస్తుత ఫ్యాషన్ ట్రెండ్స్ గురించి చాలా నాలెడ్జ్ షేర్ చేస్తుంది. తద్వారా ప్రజలు మంచి లైఫ్‌స్టైల్ గడిపేలా ప్రోత్సహిస్తుంది. అలాగే అభిమానులతో ఫ్రెండ్లీ రిలేషన్‌షిప్ ఏర్పరచుకోవాలని, వారిని క్రమం తప్పకుండా మోటివేట్ చేయాలని ఆశిస్తుంది. ఈ డిజిటల్ బ్యూటీ హెల్త్, ఫ్యాషన్ ట్రెండ్స్‌పై బ్లాగులను ప్రచురించే ఓ వెబ్‌సైట్‌ను కూడా రన్ చేస్తుంది.

### డెవలపర్ క్రియేటివిటీ

జరా శతావరిని రాహుల్ చౌదరి డెవలప్ చేశారు. ఆయన భారతదేశానికి చెందిన ఒక మొబైల్ ప్రకటనల సంస్థ సహ వ్యవస్థాపకుడు. ఇటీవల ఫోర్బ్స్‌తో మాట్లాడుతూ, AI ప్రయోజనాలు, నష్టాల గురించి చాలా చర్చలు జరుగుతున్నా దానిని మనం ఎలా ఉపయోగిస్తాం అనే దానిపై అన్నీ ఆధారపడి ఉంటాయని చెప్పారు. జరా శతావరి లక్ష్యం AI సామర్థ్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించడమని.. మానవాళికి దానిని ఎలా ఉపయోగించుకోవచ్చో చూపిస్తామని చౌదరి తెలిపారు.

### సోషల్ మీడియాలో ఫుల్ క్రేజ్

ఈ AI ఉమెన్ ఇన్‌స్టాగ్రామ్ ఫీడ్‌లో, ఆమెకు సంబంధించిన చాలా ఫొటోలు ఉన్నాయి. యోగా బంతిపై హోపింగ్ చేయడం, ఒక ప్రశాంతమైన ట్రాపికల్ స్పా బయట విశ్రాంతి తీసుకోవడం, ఆదివారం ఉదయం రిలాక్స్ అవ్వడం వంటి ఫొటోలు కూడా ఉన్నాయి. ఒక ఫొటోలో రెడ్ కలర్ చీర కట్టుకొని, దీపాలతో నిండిన గదిలో దీపావళి శుభాకాంక్షలు చెప్పడం కనిపించింది. మరొక ఫొటోలో ఆమె అందరికీ ఈద్ శుభాకాంక్షలు తెలియజేసింది.

# భారతదేశంలో ఆల్-న్యూ బిఎండబ్ల్యూ ఆర్ 1300 జిఎస్ విడుదల

ముందడుగు హైదరాబాద్:

భారతదేశంలో బిఎండబ్ల్యూ మోటర్రాడ్ ఇండియా ఆల్-న్యూ బిఎండబ్ల్యూ ఆర్ 1300 జిఎస్ ని విడుదల చేసింది. ఈ అడ్వెంచర్ మోటార్‌సైకిల్ కంప్లీట్లీ బిల్ట్-అప్ యూనిట్ గా అందుబాటులో ఉంటుంది మరియు జూన్ 2024 చివరి నుంచి డెలివరీలు ప్రారంభమవుతాయి. మిస్టర్ విక్రమ్ పవాహ్, ప్రెసిడెం,ట్ బిఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా మాట్లాడుతూ బిఎండబ్ల్యూ మోటోరాడ్ నాలుగు దశాబ్దాల క్రితం ఆర్ 80 G/S తో టూరింగ్ ఎండ్యూరోల కొత్త విభాగాన్ని నెలకొల్పింది. బాక్సర్ ఇంజిన్ కలిగిన బిఎండబ్ల్యూ జిఎస్



అప్పటి నుంచి పోటీ రంగంలో తిరుగులేని నాయకునిగా కొనసాగుతోంది. ఆల్-న్యూ బిఎండబ్ల్యూ ఆర్ 1300 జిఎస్ తో, బిఎండబ్ల్యూ మోటార్రాడ్ జిఎస్ ని మరింత పదును పెట్టడంపై దృష్టి సారించింది. ఇది శక్తి, సౌలభ్యం మరియు చురుకుదనాల ఖచ్చితమైన కలయికగా, ఇది ఏ భూభాగానికి అయినా అనువైన మోటార్‌సైకిల్‌గా ఉంటుంది. దాని బహుముఖ ప్రజ్ఞ మరియు ఆకర్షణతో, ఆల్-న్యూ బిఎండబ్ల్యూ ఆర్ 1300 జిఎస్ అత్యధిక అంచనాలను కూడా అధిగమిస్తుంది. ఏదీ మిమ్మల్ని ఆపదు, ముఖ్యంగా ఆఫ్-రోడ్ అయినా" అని పేర్కొన్నారు.

## రెఫరల్ ప్రోగ్రామ్‌ను లాంచ్ చేసిన
# ఫోన్‌పే పేమెంట్ గేట్‌వే

ముందడుగు హైదరాబాద్:

ఫోన్‌పే పేమెంట్ గేట్‌వే ఈరోజు తన రెఫరల్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఆన్‌లైన్ వేదికగా బిజినెస్ వృద్ధికి సహాయపడే వారి కోసం ఫోన్‌పే PG పార్ట్‌నర్ ప్రోగ్రామ్‌ను రూపొందించింది. రెఫరల్ పార్ట్‌నర్‌గా ఉన్న వ్యక్తి, తన క్లయింట్లను సంప్రదించి, కస్టమర్ల నుండి ఆన్‌లైన్ పేమెంట్లను యాక్సెప్ట్ చేయమని, బిజినెస్ వృద్ధిని పెంచుకోమని వారికి సూచించవచ్చు. ఈ ప్రోగ్రామ్ ఆవిష్కరణ సందర్భంగా, ఫోన్‌పే పేమెంట్ గేట్‌వే & ఆన్‌లైన్ మర్చంట్స్ హెడ్ అంకిత్ గౌర్ మాట్లాడుతూ, "అత్యాధునిక పేమెంట్ సొల్యూషన్లు, రివార్డింగ్ పార్ట్‌నర్‌షిప్‌లను అందిస్తూ, బిజినెస్‌లకు సాధికారతను కల్పించడం కోసం మేము అంకితభావంతో పనిచేస్తున్నామనే విషయాన్ని మా ఫోన్‌పే PG పార్ట్‌నర్ ప్రోగ్రామ్ లాంచ్‌తో మరోసారి స్పష్టం చేశాము. మా రెఫరల్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినప్పటి నుండి, ఇప్పటిదాకా ఈ ప్రోగ్రామ్‌లో చేరుతున్నవారి సంఖ్యలో 10 రెట్లకు పైగా వృద్ధి కనిపించింది. ఈ చొరవతో, మర్చంట్లకు తమ ఆన్‌లైన్ బిజినెస్ విజయావకాశాన్ని మెరుగుపరచడం కోసం అత్యాధునిక ఫిన్‌టెక్ సొల్యూషన్‌లు, ఆఫర్లను ఉపయోగించుకునే అవకాశం కల్పించాలని భావిస్తున్నాము" అని చెప్పారు.

ముందడుగు
గురువారం, 20-6-2024, హైదరాబాద్




## ఆ విషయంలో తగ్గేదేలే!

ఒకప్పుడు తెలుగు అగ్ర కథానాయికల్లో ఒకరిగా చెలామణి అయ్యింది మంగళూరు సోయగం పూజా హెగ్డే. వరుసగా భారీ చిత్రాల్లో అవకాశాలు సంపాదించుకొని సత్తా చాటింది. అయితే గత కొంతకాలగా ఈ భామకు అదృష్టం కలిసి రావడం లేదు. తెలుగు, హిందీ భాషల్లో ఆమె నటించిన చిత్రాలు పరాజయం పాలవడంతో రేసులో పూర్తిగా వెనకబడింది. అయితే తమిళంలో ఇటీవలే సూర్య చిత్రంలో అవకాశాన్ని దక్కించుకొని అందరిని ఆశ్చర్యపరిచింది. ఈ సినిమా తనకు పూర్వ వైభవాన్ని తీసుకొస్తుందనే ఆశాభావంతో ఉంది పూజాహెగ్డే. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో పీరియాడిక్ డ్రామాగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా కోసం పూజాహెగ్డే రెమ్యునరేషన్‌ను పెంచినట్లు తెలిసింది. గతంలో ఒక్కో సినిమాకు మూడు కోట్ల రెమ్యునరేషన్ అందుకుంది పూజాహెగ్డే. అయితే సూర్య సినిమాకు మాత్రం నాలుగు కోట్లకు పైగా ఛార్జ్ చేస్తున్నదని తెలిసింది. పీరియాడిక్ కథతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో కథానాయిక పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని, డేట్స్ కూడా పెద్ద మొత్తంలో కేటాయించాల్సి రావడంతో పూజాహెగ్డే రెమ్యునరేషన్ పెంచిందని అంటున్నారు. అవకాశాలు తగ్గిపోయినా పారితోషికం విషయంలో ఏమాత్రం తగ్గేదేలేదన్నది పూజాహెగ్డే నిర్ణయమని ఆమె సన్నిహితులు అంటున్నారు. ఈ చిత్రాన్ని కార్తీక్ సుబ్బరాజ్, కల్యాణ్ సుబ్రమణియం, సూర్య, జ్యోతిక నిర్మిస్తున్నారు. త్వరలో టైటిల్‌ను ప్రకటించబోతున్నారు.



## కల్కిలో కొత్త ప్రపంచాన్ని చూస్తారు

"కల్కి 2898 ఏడీ' చిత్రంలో భాగం కావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. ఇదొక అద్భుతమైన అనుభవం. ఈ సినిమా ద్వారా ఓ కొత్త ప్రపంచాన్ని చూస్తారు. ఇలాంటి సినిమాను గతంలో ఎప్పుడూ చేయలేదు' అన్నారు బిగ్‌బి అమితాబ్ బచ్చన్. బుధవారం ముంబయిలో 'కల్కి 2898 ఏడీ' ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో ప్రభాస్, కథానాయిక దీపికా పడుకోన్, కమల్‌హాసన్, చిత్ర దర్శకుడు నాగ్ అశ్విన్ పాల్గొన్నారు. వైజయంతీ మూవీస్ పతాకంపై అశ్వినిదత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా అమితాబ్‌బచ్చన్ మాట్లాడుతూ 'నాగ్‌అశ్విన్ ఈ కథ చెప్పినప్పుడు చాలా ఆశ్చర్యపోయాను. ఇందులో ఉన్న విజువల్స్ మరో స్థాయిలో ఉంటాయి. ఈ సినిమా ఎక్స్‌పీరియన్స్‌ను ఎప్పటికీ మర్చిపోలేను' అన్నారు. కమల్‌హాసన్ మాట్లాడుతూ 'దర్శకుడు నాగ్‌అశ్విన్ మా గురువు బాలచందర్‌గారిలా ఆర్డీనరీగా కనిపించే ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్. తన ఐడియాను తెరపైకి అద్భుతంగా తీసుకొచ్చాడు. ఈ సినిమాలో ప్రతినాయకుడి పాత్రను పోషించాను. నా పాత్ర సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది' అని చెప్పారు. ప్రభాస్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ వంటి గ్రేటెస్ట్ లెజెండ్స్‌తో కలిసి పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. కమల్‌హాసన్‌గారు నటించిన 'సాగరసంగమం' చూసి అలాంటి డ్రెస్ కావాలని మా అమ్మను అడిగాను. 'ఇంద్రుడు చంద్రుడు' సినిమా చూసి ఆయనలా యాక్టింగ్ చేసేందుకు ప్రయత్నించే వాడిని. అలాగే దీపికా పడుకోన్ వంటి ఇంటర్నేషనల్ స్టార్‌తో పనిచేయడం మరపురాని అనుభూతినిచ్చింది' అన్నారు. ఈ సినిమా ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుందని, దర్శకుడు నాగ్‌అశ్విన్ తెరపై మ్యాజిక్ క్రియేట్ చేశారని దీపికా పడుకోన్ చెప్పింది. అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పడుకోన్ వంటి అగ్ర తారల సమక్షంలో ఈ వేడుకను జరుపుకోవడం ఆనందంగా ఉందని నిర్మాత అశ్వినిదత్ అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.



## కోపం చాలు శ్రీమతిగారు

దుల్కర్ సల్మాన్, మీనాక్షి చౌదరి జంటగా నటిస్తున్న చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయిక. పాన్ ఇండియా స్థాయిలో భారీగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాలో 'శ్రీమతి గారు..' అనే తొలి గీతాన్ని బుధవారం విడుదల చేశారు. జీవీ ప్రకాష్ కుమార్ స్వరపరచిన ఈ మెలోడీ గీతం వినసొంపుగా సాగింది. శ్రీమణి సాహిత్యాన్నందించిన ఈ గీతాన్ని విశాల్ మిశ్రా, శ్వేతా మోహన్ ఆలపించారు. 'కోపాలు చాలండి శ్రీమతిగారు కొంచెం కూల్ అవ్వండి మేడం గారు' అంటూ కోపంతో అలిగిన భార్యను బుజ్జగిస్తూ భర్త పాడే ఈ పాట అందమైన భావాలతో సాగుతుందని చిత్ర బృందం పేర్కొంది. 1980-90 దశకంలో అసాధారణ విజయాలను సాధించిన ఓ బ్యాంక్ క్యాషియర్ నేపథ్య కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: నిమిష్ రవి, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, రచన-దర్శకత్వం: వెంకీ అట్లూరి.